క్లుప్తంగా

సైకిల్‌పై జీవీఎంసీకి కమిషనర్



జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీకి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఈ–మెయిల్ ఐడీ endow& eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. సంస్థ నిర్వహించిన ×రహదారి భద్రత పౌరుల బాధ్యత¤ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రహదారి భద్రతపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీల చేతుల మీదుగా విజేతలైన ఉషశ్రీ, శ్రావ్య, చంద్రిక, సంతోషి, నందిని, అఖిల, దియాపాల్‌కు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి, అధ్యాపక సిబ్బంది, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య విలువలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ సమకాలిన అంశాలపై అవగాహన సాధిస్తే పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తారన్నారు. జ్ఞానం, నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షుడు ఆచార్య ప్రసన్నకుమార్, ఉన్నత భారత్ అభియాన్ సమన్వయకర్త రామారావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కంటికి రెప్పలా...



బంగారు వస్తువులు కొనుగోలు చేసి ఎమ్మెల్యే వాసుపల్లి చేతుల మీదుగా అందజేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

- అనాథలు, అభాగ్యులకు అండగా స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ
- 2014 నుంచి సేవలు
- వందపడకల వృద్ధాశ్రమమే ధ్యేయంగా అడుగులు



సంస్థలో సంతోషంగా వృద్ధులతో నిర్వాహకులు



పండగ వేళ ఆనందంగా..(ఫైల్)

డాబాగార్డెన్స్ : పాత నగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ 2014 ఫిబ్రవరి 19న రామకృష్ణ పరమహంస జయంతి రోజున స్థాపించారు. అనాథలను, అభాగ్యులను అక్కున చేర్చుకుని వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. 14 మంది వృద్ధులతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి, వారికి ఉచితంగా ఆశ్రయం కల్పించడమే గాక సంరక్షణ బాధ్యతలు సంస్థ నిర్వహకులు చూసుకుంటున్నారు. ప్రతి నెలా స్నేహ సంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ప్రతి నెలా వచ్చే పెన్షన్‌తో వారి అవసరాల కోసం కొంత మొత్తాన్ని ఉంచి, మిగతా డబ్బులతో వారికి బంగారు వస్తువులు చేయిస్తున్నారు. ఎందుకంటే వారి అంతిమయాత్రకైనా పిల్లలు వస్తారని సంస్థ ఆశ. దాతల సహకారంతో ఆధ్యాత్మిక యాత్రలకు తీసుకెళ్తున్నారు. ఇప్పటి వరకు కాశీ, రామేశ్వరం, కన్యాకుమారి, కోల్‌కతా, శ్రీశైలం, మహానంది, గయా, బుద్ధగయా, అరుణాచలం, తిరుపతి, విజయవాడ తదితర పుణ్యక్షేత్రాలు తీసుకెళ్లారు. వృద్ధుల బాగోగుల కోసం సంస్థ కృషి చేస్తుంటే వారిలో ఎవరైనా అనారోగ్యంతో మంచాన పడితే ఏఎన్‌బీచ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. వృద్ధులు ఎవరైనా చనిపోతే వివేకానంద సంస్థ సభ్యులే స్వయంగా అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా కాశీలో పిండప్రధాన కార్యక్రమం నిర్వహిస్తూవస్తున్నారు. మానసికంగా, సంతోషంగా ఉండడానికి ప్రతి నెలా సంస్థ ఆధ్వర్యంలో సినిమాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. సంక్రాంతి, ఉగాది తదితర పండగలు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు వృద్ధులతోనే చేసుకోవడం విశేషం.

11 ఏళ్లగా ఆశ్రయం పొందుతున్నా..



వృద్ధాశ్రమం ఏర్పాటు నుంచి వివేకానంద వృద్ధాశ్రమంలోనే ఆశ్రయం పొందుతున్నా. కుమారుడు, కోడలు, మనవరాలు అందరూ ఉన్నారు. కానీ నన్ను ఎవరూ చూడరు. నన్ను చూడడానికి వారెవరూ రారు. నేనే ప్రతి నెలా వారి వద్దకు వెళ్లి చూసి వస్తుంటాను. సంస్థ చాలా బాగా చూసుకుంటోంది. పెన్షన్ డబ్బులో అవసరాలకు ఉంచుకొని, మిగిలిన డబ్బు బ్యాంకులో ఉంచుతున్నారు. ఆ డబ్బుతో బంగారు గొలుసు, రెండు ఉంగరాలు కొన్నారు. ఆరోగ్యం బాగోలేకపోతే కన్నతండ్రిలా సంస్థ అధ్యక్షుడు అప్పారావు చూసుకుంటున్నారు.

–చిగురుకోట సూర్యనారాయణ

బాగా చూసుకుంటున్నారు



ఆరేళ్లగా సంస్థలోనే ఆశ్రయం పొందుతున్నాను. నాకు ఎవరూ లేరు. మా ఆనందం కోసం పుణ్యక్షేత్రాలు తీసుకెళ్తుంటారు. పండగలు, పూజలు సంస్థలోనే బాగా చేసుకుంటాం. సంస్థలో ఉన్నవాళ్లంతా ఓ కుటుంబ సభ్యుల్లా మమ్మల్ని చూసుకుంటున్నారు. చాలా ఆనందగా ఉంది.

–బొండా కనకమహాలక్ష్మి
ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలు

అనాథలుగా మిగిలిపోకూడదనే..



రోజులు మారుతున్న దృష్ట్యా పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. శేషజీవితంలో హాయిగా ఉండాల్సిన వృద్ధులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందరూ ఉన్నా అనాథగానే మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో సంస్థ ప్రారంభించాం. సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు వైద్యపరంగా చూసుకుంటున్నాం. వారి మానసిక ప్రశాంతతకు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తుంటాం. వారికి వచ్చే పెన్షన్ డబ్బుతో వారి అవసరాలకు కొంత మొత్తం పోగా, మిగిలిన డబ్బు వారి పేరిట బ్యాంకులో దాచి వారికి బంగారు వస్తువులు చేయిస్తున్నాం. భవిష్యత్‌లో వంద పడకల వృద్ధాశ్రమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఇలా సేవలందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. సేవాకార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్న వారందిరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

–సూరాడ అప్పారావు, సంస్థ అధ్యక్షుడు

జోన్-4 జెడ్సీగా ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



జోన్-4 కమిషనర్ ప్రసాదరావు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కమిషనర్‌గా పీవీవీడీ ప్రసాదరావు నియమితులైయ్యారు. ఇప్పటి వరకు గాజువాక జోనల్ కమిషనర్‌గా పనిచేసిన ఆయన జోన్–4 సూర్యాబాగ్ కార్యాలయనికి కమిషనర్‌గా బదిలీ కావడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

22న మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై వ్యతిరేక సదస్సు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఈ నెల 22వ తేదీన పీవోడబ్ల్యూవో ఆధ్వర్యంలో ×మద్యం,గంజాయి, డ్రగ్స్¤ వ్యతిరేక సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి రోహిణి దేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పీవోడబ్ల్యూవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవోడబ్ల్యూవో ఏర్పడి 50 ఏళ్ల అవుతున్న సందర్భంగా అర్ధ శతాబ్ది వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించుకునే లక్ష్యంతో ఈ సదస్సుని నిర్వహించనున్నామన్నారు.

వేడుకగా 'ప్రేమసమాజం' వార్షికోత్సవం



జిల్లా రిజిస్ట్రార్ బాలకృష్ణను సత్కరిస్తున్న ప్రేమసమాజం యాజమాన్యం



మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ప్రేమసమాజం నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ప్రేమ ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల 72వ వార్షికోత్సవం సోమవారం డాబాగార్డెన్స్ ప్రేమసమాజం కంచర్ల అన్నపూర్ణాదేవి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా రిజిస్ట్రార్, తపాలా శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ జి.బాలకృష్ణ, గీతం మెడికల్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థులు నిత్య కృషితోనే రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కుల సాధించిన విద్యార్థులకు, వివిధ పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖులను సత్కరించారు. పాఠశాలల ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్ ఉప్పల భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మద్దుల రాంజీ, ప్రేమసమాజం ఉపాధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి వీకే సురేష్‌కుమార్, కోన జగదీశ్వరరావు, నాగేశ్వరరావు, భగవత్ పరమేశ్వర్, ఎస్ అప్పలరాజు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రామలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఎరుకుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్మన్, ఈవో

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 27 వార్డు దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి సోమవారం సాయంత్రం జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గంగవరపు శ్రీనివాసరావు, అర్చకుడు కేవీకే శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, కార్యా నిర్వహణాధికారిణి జి. రమాబాయి, ట్రస్టు సభ్యులు పూజలు నిర్వహించారు. భీష్మాకాదశి సందర్భంగా మంగళవారం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో 41 వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తలు పిల్లి స్వాతి, పిల్లి దుర్గ పాల్గొన్నారు.

పేద రోగులకు ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



32వ వార్డులో పితాని కనకరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మర్రి బాలరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున ఎమ్మెల్యే

అల్లిపురం: ప్రజాదర్బార్‌లో ఆర్థిక సహకారం అందించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కోరిన పేద రోగులను ఆదుకున్నారు. సోమవారం ఆయన పది మందికి రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నిరంతర సేవా కార్యక్రమాలతో బిజీగా గడిపే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5వేలు చొప్పున అందజేశారు. జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో హరిజనవీధికి చెందిన మర్రి బాలరాజు, 32వ వార్డులో అల్లిపురం మెయిన్‌రోడ్డులో గాంధీబొమ్మ దగ్గర నివసిస్తున్న పితాని కనకరాజు, 29వ వార్డు గోకుల్ రోడ్డులో నివసిస్తున్న కోరాడ మౌనిక కుటుంబానికి పెద్ద కర్మ నిమిత్తం రూ.5వేలు అందజేశారు. 29వ వార్డు అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన కొయ్య మోక్షిత తన్మయికు, 30వ వార్డు జాలారిపేటకు చెందిన కాసారపు రమేష్, 37వ వార్డు జబ్బర్‌తోట ప్రాంతానికి చెందిన వాసుపల్లి నవీన్‌కు, 37వ వార్డు గొల్లవీధికి చెందిన ఏసుపోరి శారదకు, చెంగళరావు పేటకు చెందిన సోమనా రవితేజకు, 30వ వార్డు తాడివీధికి చెందిన గొర్రెల సునీతకు రూ.5వేలు చొప్పున ఆర్థిక ఆసరా కల్పించారు. 30వ వార్డు తాడివీధికి చెందిన బుడుమూరి కృష్ణ పెద్దకర్మ నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నీలమాంబేశ్వరి తొలేళ్ల ఉత్సవం



నీలమాంబేశ్వరి అమ్మవారు



కళశాలతో తిరువీధిలో పాల్గొన్న కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీ నీలమాంబేశ్వరి వార్షిక ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద ఎత్తున పసుపు, కుంకుమలు, వేపకొమ్మలతో నింపిన కళశాలతో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి సతకం పట్టునుంచి ప్రారంభమైన తిరువీధి ఉత్సవం యాతపేట, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట, జెండాచెట్టు మీదుగా యాతపేటలోని అమ్మవారి ఆలయం వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కళశాలతో తీసుకువచ్చిన పవిత్రజలాలతో అభిషేకించారు.

నేడు ప్రధాన ఉత్సవం..

నీలమాంబేశ్వరి అమ్మవారి ప్రధాన ఉత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు చంద్రరావు తెలిపారు. అమ్మవారికి తెల్లవారుజాము నుంచి విశేష అభిషేకాలు, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

మద్దిలపాలెం : విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ద్వారకా జోన్ క్రైమ్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్స్, పోక్సో చట్టాలపై మద్దిలపాలెంలోని వీఎస్ కృష్ణా కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడి ఎంతో మంది విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కోపం, ఉద్రేకం, ఇతర విద్యార్థులకు భిన్నంగా ఉండాలనే ఆలోచనలతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేసుల్లో చిక్కుకుంటున్నారని చెప్పారు. పెరుగుతున్న టెక్నాలజీని వినియోగించి సోషల్ మీడియాలో పక్కవారిపై అవమానకర పోస్టులు పెడుతూ కష్టాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. సైబర్ క్రైమ్ చట్టాలలో భాగంగా శిక్షలకు గురవుతున్నారన్నారు. విద్యార్థినుల పట్ల వికృత చేష్టలకు దిగుతూ పోక్సో చట్టాల ప్రకారం శిక్షలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేరాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. నేరాలకు మాదకద్రవ్యాల వినియోగం కూడా ప్రధానమనే విషయాన్ని గుర్తించాలన్నారు. నేర సంస్కృతికి పూర్తిగా దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదిగేందుకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్‌ధాస్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: స్టార్స్ కళాంజలి ఈవెంట్స్ వెంకట్ అండ్ టీం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా గాయకుడు పూతి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయనీ గాయకులు పాల్గొని పలు గీతాలు మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్కార కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, టీడీపీ నాయకుడు ఆడారి కిషోర్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నా తిరుమలరావు, స్టార్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అమరేంద్ర, రాయుడు కుమార్, బెల్లం జైకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో దర్శకుడు వినోద్, ఏపీ మా మాజీ అధ్యక్షుడు కృష్ణకిషోర్, పి.శ్యాంకుమార్, రమేష్ యాదవ్, విజయ్‌రమణి పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి వద్దు : గొండుసీతారామ్

కంచరపాలెం : విద్యార్థులకు ఒత్తిడి లేని చదువులు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో సోమవారం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) సారథ్యంలో పరీక్షాపే చర్చ–2024 పేరిట నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పరీక్షలు రాసే విద్యార్థుల్లో మార్కుల భయం పోగొట్టాలన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కో–ఆర్డినేటర్ కె.చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు పేరెంట్స్, టీచర్స్ అధిక సమయం వెచ్చించి వారిలో ధైర్యం నింపాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ , జిల్లా ఉప విద్యాశాఖాధికారి గౌరీ శంకర్‌రావు, ఎ.రమేష్, డైట్ భీమిలి లెక్చరర్ త్రినాథరావు, ఖలీషాబేగం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల కిటికీ గ్రిల్ పడి విద్యార్థికి గాయాలు



ఎంఈవో పద్మావతితో విద్యార్థి సంఘం ప్రతినిధులు

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాల కిటికీ గ్రిల్ జారిపడి ఆదివారం ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన వివేక్ ఇక్కడ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అతడిని చూడడానికి వివేక్ అక్క నందిని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చింది. ఆమె పాఠశాల నుంచి తిరిగి వెళ్తుండగా పాఠశాల నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కిటికీ గ్రిల్ ఊడి నందిని తలపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సంగివలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న నందిని తండ్రి భాస్కరరావు, మరికొంత మంది పాఠశాలకు చేరుకొని సంఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. స్థానిక పోలీసులకు ఆస్పత్రి వర్గాల వారు విచారణ నిమిత్తం సమాచారం అందించారు.

ఎంఈవో విచారణ

ఆనందపురం ఎంఈవో ఎస్‌ఎస్ పద్మావతి మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. గ్రిల్ ఊడిపడిన కిటికీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న హాస్టల్ గదులు కిటికీల గ్రిల్స్ అన్నీ బలహీనంగా ఉన్నాయని వెల్లడించారు. కిటికీలకు ఉన్న అన్ని గ్రిల్స్‌ను సరిచేసేంత వరకూ ఆ ఫ్లోర్‌లో హాస్టల్ నిర్వహించరాదని ఆదేశాలిచ్చారు. సంఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

అకారణంగా గాయాలు పాలైన విద్యార్థి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని ఏబీవీపీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల నిర్వహిస్తున్న గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయని భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఉందని నందిని కుటుంబ సభ్యులు మాత్రం కేసు అక్కరలేదని తెలిపి నందిని సొంత గ్రామానికి తీసుకొని వెళ్లిపోయినట్టు తెలిపారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామికి సోమవారం విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామిని అభిషేకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

'కెమ్ ఈఈఈ-2024' సదస్సు ప్రారంభం



సదస్సు షెడ్యూల్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వరకు విశాఖలోని ఓ హోటల్‌లో సోమవారం కెమికల్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ (కెమ్ ఈఈఈ– 2024) ట్రెండ్స్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శక్తి పరివర్తన ప్రాముఖ్యత, ఉద్యోగ కల్పనలో స్టార్టప్‌ల పాత్రను ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సుద్ధసత్వబసు వివరించారు. ఎన్‌టీపీసీతో హైడ్రోజన్ ఉత్పత్తిపై పారిశ్రామిక ప్రాజెక్టులు, ఐఐపీఈ వృద్ధి, రూ.50 కోట్లకు పైగా పరిశోధన నిధులు పొందామని ఐఐపీఈ డైరక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. బాలికలకు ఫెలోషిప్‌లు, శాండ్‌విచ్ పీహెచ్‌డీల గూర్చి వివరించారు. కెమ్ ఈఈఈ–2024 కన్వీనర్ ప్రొఫెసర్ హేమంత్‌కుమార తన్నేరు కాన్ఫరెన్స్ థీమ్‌ను పరిచయం చేస్తూ ఈవెంట్ స్పాన్సర్స్ విద్యాన్ బయో, సెర్బ్–ఇండియా, ఇండియన్ బ్యాంక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు షెడ్యూల్‌ను సదస్సు అధ్యక్షుడు ప్రొఫెసర్ శేష గిరిరావు అంబటి వివరించారు. ఐఐపీఈ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కొనసాగుతున్న కార్యకలాపాలను కెమ్ ఈఈఈ– 2024 ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటరెడ్డి పల్లేటి వివరించారు.